

శరవేగంగా తాడేరు వంతెన నిర్మాణం : ఎంఎల్‌ఎ

భీమవరం రూరల్‌:తాడేరు వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ అన్నారు. గురువారం ఆయన వంతెన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండోసారి ఎంఎల్‌ఎగా ఎన్నికైన తర్వాత ఈ వంతెన మీదుగా వెళ్తే సమయంలో పరిశీలించామని, వంతెన శిథిలావస్థకు చేరుకుందని గుర్తించామని తెలిపారు. వంతెనకు రంధ్రం పడడంతో పాటు, రెయిలింగ్‌కు ఇనుకలను పేర్చి ఉన్న దాన్ని కూడా చూశామని తెలిపారు. ఈ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రజల ప్రాణాలకు ఇబ్బంది ఉంటుందని భావించి వెంటనే వంతెనపై నుంచి పెద్ద వాహనాలు వెళ్లకుండా గెడ్డర్లను ఏర్పాటు చేయడంతో పాటు, ఇనుప వట్రాన్ని వంతెనకు బిగించామని తెలిపారు. వంతెన నిర్మాణ పనులకు సంబంధించి రూ.కోటీ 90 లక్షల నిధులు మంజూరు చేయించి, 9 సార్లు టెండర్లు పిలిచామని తెలిపారు. ప్రస్తుతం వంతెన పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, బిసి జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్‌, చినమిల్లి వెంకటరాయుడు, కోమటి రాంబాబు ఉన్నారు.

గోదా'వరీ'..!

తరుముకొస్తున్న వరద
భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
పోలవరం కాపర్ డ్యామ్ వద్ద 32 మీటర్లకు చేరిన నీటిమట్టం
కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 26 గ్రామాలకు రాకపోకలు బంద్
గొమ్ముగూడెంలో 253 కుటుంబాలు పునరావాస శిబిరాలకు తరలింపు
భయం గుప్పెట్లో ముంపు మండలాల ప్రజలు
కలెక్టరేట్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద తరుముకొస్తోంది. రోజురోజుకీ గోదావరి నీటిమట్టం ఉధృతంగా పెరుగుతోంది. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 31 అడుగులు ఉండగా గురువారం సాయంత్రానికి 43 అడుగులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. పోలవరం ఎగువ కాపర్‌ డ్యామ్‌ వద్ద నీటిమట్టం 29 మీటర్ల నుంచి 32 మీటర్లకు పెరిగింది. దీన్నిబట్టి వరద ఎంత ఉధృతంగా పెరుగుతుందో స్పష్టమవుతోంది. గతేడాది వరదలతో తీవ్ర ఇబ్బందులు పడిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు మళ్లీ వరద భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరద ఉధృతి కారణంగా వాగులు, వంకలు పొంగి కాజ్‌వేలు నీట మునుగుతున్నాయి. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కాజ్‌వేపై వరద నీరు చేరి బెస్తగూడెం, గొమ్ముగూడెం, దాచారం, నెమలిపేట వంటి 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో ఎద్దువాగు పొంగడంతో కాజ్‌వేపై వరద నీరు చేరి కొయిదా, కట్కూరు, యడవల్లి, చిగురుమామిడి, కాచారం, కొత్తూరు వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద ఉధృతికి గోదావరికి ఆనుకుని ఉన్న కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని 253 కుటుంబాలను ముందస్తు చర్యల్లో భాగంగా రావికుంట పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేసిన శిబిరానికి గురువారం సాయంత్రం అధికారులు తరలించారు. గతేడాది జులైలో వచ్చిన వరదలకు గొమ్ముగూడెం ప్రజలు దాదాపు మూడు నెలలపాటు పునరావాస శిబిరాల్లోనే ఉన్నారు. మళ్లీ పట్టుమని తొమ్మిది నెలలు గడవకముందే మళ్లీ పునరావాస శిబిరానికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలో గురువారం సైతం వర్షం కురుస్తూనే ఉంది. పైనుంచి వరద నీరు గోదావరిలోకి పెద్దఎత్తున చేరుతుండటంతో శుక్రవారం సాయంత్రానికి వరద ఉధృతి మరింత పెరిగే పరిస్థితులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్‌ ప్రసన్నవెంకటేష్‌ అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌, ఆర్‌డిఒ, తహశీల్దార్‌ కార్యాలయాల్లో కంట్రోల్‌ రూములు ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, క్లోరిన్‌ టాబ్లెట్లు, మెడికల్‌ క్యాంపుల ఏర్పాటు, పాముకాటు నివారణకు సంబంధించిన మందులు, గర్భిణుల తరలింపునకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్‌ దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వాసితులకు కష్టాలు

గతేడాది వరదలకు వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు అతలాకుతలమయ్యాయి. కాపర్‌ డ్యామ్‌ నిర్మాణంతో వేగంగా వరద నీరు గ్రామాల్లోకి చేరింది. అయినప్పటికీ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ఇవ్వకుండా ఏదొ కాలంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో మళ్లీ వరద తరుముకొస్తుండటంతో జనం భయం భయంగా కాలం గడుపుతున్నారు. 2022 ఆక్టోబర్‌కు 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పరిహారం అందించి తరలిస్తామని సిఎం ఇచ్చిన హామీ సైతం బుట్టదాఖలైంది. నిర్వాసితుల ఇబ్బందులకు ప్రభుత్వమే కారణం. ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనని భయం నిర్వాసితులను వెంటాడుతోంది.

లంకలకు పడవ ప్రయాణాలు నిషేధం..



గోదావరి ఉధృతిని సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ చెరుకువాడ

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరికి వరద నీరు పోటెత్తడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోదావరి వరద గురువారం సాయంత్రానికి మరో రెండు అడుగుల మేర పెరిగింది. దీంతో లంక గ్రామాలకు ముందస్తు జాగ్రత్త చర్యగా పడవ ప్రయాణాలు నిషేధించారు. కరుగోరుమిల్లి పుష్కర ఘాట్‌ పూర్తిగా నీట మునిగింది. లంక గ్రామాలకు పడవ ప్రయాణాలు నిషేధించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఇబ్బందులైతే వర్ణనాతీతం. పెదమల్లం గ్రామానికి చెందిన సుమారు 200కుపైగా పశువులు ఉన్నాయి. వీటి పోషణకు రైతులు రోజు ఉదయం, సాయంత్రం వెళ్లి పాలు తీసుకొస్తుంటారు. గోదావరి నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే పశువులను ఏటిగట్టుకు చేరుస్తారు. అప్పటి వరకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇప్పటి నుంచే పడవ ప్రయాణాలపై నిషేధం విధించడంతో ఏం చేయాలో పాలుపోక తల్లడిల్లుతున్నారు. గోదావరి నీటిమట్టం మరో పది అడుగులు పెరిగినా ఎటువంటి ఇబ్బంది లేదని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. గోదావరి వరద క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమం ఆయోధ్యలంక గ్రామంలో సర్పంచి కడలి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం గోదావరి ఇసుక ర్యాంపు నుంచి నీటిలో కొంతమేర నడుచుకుంటూ వరద పరిస్థితిని సమీక్షించారు.

విద్య ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

విద్య ప్రతి విద్యార్థి జన్మహక్కుగా ఉండాలి
ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ముగింపు సభలో జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ



సభలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌



ముగింపు సభకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్‌

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య ప్రయివేటీకరణ విధానాలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్‌ నారాయణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కాంక్షిస్తూ విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఈ నెల 11న నరసాపురంలో ప్రారంభించిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర గురువారం జిల్లా కేంద్రం భీమవరంలో ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వాసు అధ్యక్షతన స్థానిక లాంచీలరేవు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి నితీష్‌ నారాయణ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి విద్యార్థికీ జన్మహక్కుగా ఉండాలన్నారు. అయితే దేశంలో అటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తున్నాయన్నారు. క్యూబా లాంటి దేశాలను సందర్శించినప్పుడు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అక్కడి ప్రభుత్వాలు ప్రజలకు ఉచిత విద్యను అందిస్తున్నాయన్నారు. విద్యను ప్రోత్సహించని ప్రభుత్వం సమాజ వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పెద్ద పెద్ద అంబేద్కర్‌ విగ్రహాలు పెడుతున్నారుగాని ఆయన కోరుకున్న సమానత్వం కోసం ఏ ప్రభుత్వాలూ పని చేయడం లేదని విమర్శించారు. ఆశయాల సాధన చేయని ప్రభుత్వాలకు విగ్రహాలు పెట్టే హక్కు లేదని మండిపడ్డారు. రోజు కూలీ, ఆటో డ్రైవర్‌, వ్యవసాయదారుడు, ప్రతి సామాన్యుడు పిల్లలకు కూడా ఉన్నత విద్య అందించాలని, దీనికోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. నిర్బంధం పెట్టినా, జైళ్లకు పంపినా అందరికీ ఉచిత విద్య సాధించేవరకు ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమం ఆగదన్నారు. దేశంలో నిజమైన స్వాతంత్య్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం వచ్చేవరకు విద్యార్థులందరూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్‌ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.77ను తీసుకొచ్చి పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్యను దూరం చేసిందన్నారు. 25 వేల టీచర్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి నిర్వహించి భర్తీ చేపడతామని చెప్పిన జగన్‌ ఇప్పుడు ఆ హామీని మరిచారని విమర్శించారు. పాఠశాలలు పెట్టాల్సిన ప్రభుత్వం జిఒ నెం.117 ద్వారా పాఠశాలలను మూసివేస్తుందని మండిపడ్డారు. హాస్టల్‌ విద్యార్థులకు రోజుకు రూ.52 కేటాయిస్తే ఎలాగని, అదే సొమ్ముతో సంబంధిత మంత్రి హోటల్‌లో టిఫిన్‌ చేయగలరా అని ప్రశ్నించారు. విద్యార్థులకు మెస్‌ ఛార్జీలు వెంటనే పెంచి నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ సైకిల్‌ యాత్రలో భాగంగా జిల్లాలో పాఠశాలలు, జూనియర్‌ కాలేజీలు, సంక్షేమ హాస్టళ్లలో సుమారు 40 వేల మంది విద్యార్థులను ప్రత్యక్షంగా కలుసుకున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ, ప్రభుత్వ కాలేజీలను, ప్రభుత్వ ఇంజినీరింగ్‌ కళాశాలలను ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అందరికీ దక్కాలని భవిష్యత్తులో పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. దీనిపై త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్‌, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాన్‌ప్రసాద్‌, నాయకులు పి.నాగేంద్రకుమార్‌, కె.ఈశ్వర్‌, బి.గణేష్‌, జి.శ్రీనివాసు, కె.శాంతి, కె.నవీన్‌, ఎన్‌.పవన్‌, బి.చిరంజీవి, బి.సింధుసాయి, శేఖర్‌, రవి, సిద్దు పాల్గొన్నారు.



భీమవరంలో నినదిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్‌. నేతలు



తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

మున్సిపల్ కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు



తణుకులో నిరసన తెలుపుతున్న మున్సిపల్‌ కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్‌

మున్సిపల్‌ కార్మికులకు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్‌ డిమాండ్‌ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్‌ కార్యాలయం వద్ద మహిళా కార్మికులు చేపట్టిన నిరసన దీక్షను సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ రద్దు చేసి అందరినీ పర్మినెంట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. స్కూల్‌ స్వీపర్లకు ఇచ్చే నాలుగు వేల వేతనం కూడా నాలుగు నెలలుగా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్‌ మాట్లాడుతూ మున్సిపల్‌ కార్మికులు లేకపోతే కరోనాను నేటికీ ఎదుర్కోలేమన్నారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్‌.రాజు, బి.వరలక్ష్మి, బి.విజయలక్ష్మి, ఎన్‌.అప్పన్న, నాగమణి, దుర్గ, సరోజ, రామలక్ష్మి, బంగారు పెద్దిరాజు, మునియ్య పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మున్సిపల్‌ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ సిబ్బందిని పర్మినెంట్‌ చేయాలని, సిపిఎస్‌ విధానం రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ ఆందోళనలు చేపట్టాలని ఎపి మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్‌ ఆఫీస్‌ ఎదురుగా ఉన్న గాంధీ భవన్‌ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్‌ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి ధనాల దానయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్‌ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్‌ చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు డిమాండ్‌ చేశారు. గురు, శుక్రవారాల్లో మున్సిపల్‌ కార్యాలయాల వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే పనులు మాని ఈనెల 27వ తేదీన మున్సిపల్‌ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆగస్టు ఏడో తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. మున్సిపల్‌ కార్మికులకు హెల్త్‌ అలవెన్స్‌ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో కొడమంచిలి బాబు, కె.దయామణి, బాదంపూడి గంగ, కండెల్లి సుమలత, కొల్లి.సార పాల్గొన్నారు.

తణుకురూరల్‌ : మున్సిపల్‌ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళతామని ఎపి మున్సిపల్‌ వర్కర్స్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు అన్నారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ధనాల వెంకట్రావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రెండు రోజుల నిరాహార దీక్ష, 27వ తేదీన పనులు బంద్‌, మున్సిపల్‌ కార్యాలయాల ముట్టడి, ఆగష్టు 7వ తేదీన కలెక్టరేట్ల ముట్టడి, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆగష్టు 15వ తేదీ తర్వాత రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు వెళతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్‌ జాయింట్‌ కార్యదర్శి నీలాపు ఆదినారాయణ, సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి, కార్మికులు అజ్జి అరుణాదేవి, వై.మణి, సోము పద్మ, కొడమంచిలి రాజన్న పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద రెండు రోజుల పాటు చేపట్టనున్న నిరసన దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. దీక్షలకు సిపిఎం మద్దతు తెలిపింది



తణుకురూరల్‌ : నిరసన దీక్షలో విఆర్‌ఎలు

ప్రజాశక్తి - వీరవాసరం

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విఆర్‌ఎలు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. డిఎ రికవరీ ఆపాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఈ నిరసనలో డి.ప్రదీప్‌, కె.సురేష్‌, పి.దుర్గారావు, జక్కరం, డి.శ్రీను పాల్గొన్నారు.

పోడూరు : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం మండల కార్యదర్శి కడిమి ఏసు మాట్లాడుతూ సిఎం జగన్‌ పాదయాత్రలో విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి నల్లి సుమన్‌, ఉపాధ్యక్షుడు కె.సూర్యనారాయణ, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

ఆచంట : గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విఆర్‌ఎల సంఘం (సిఐటియు అనుబంధం) మండల కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న దీక్షలను తహశీల్దార్‌ కార్యాలయం వద్ద గ్రామ సేవకుల సీనియర్‌ నాయకులు తలుపూరి ముత్యాలరావు గురువారం ప్రారంభించారు. ఈ దీక్షలకు సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్‌.శర్మ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. దీక్షలో విఆర్‌ఎల సంఘం నేతలు చెరుకొండ సాయిరాం, వి.వెంకటేశ్వరరావు, ఉందుర్తి పెదరెడ్డి, ఆచంట సత్యన్నారాయణ, కొడమంచిలి పద్మారావు, షేక్‌ సంసుద్దీన్‌, నారిన వెంకటేశ్వరరావు, కొప్పర్తి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఉండి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు పిల్లి సుబ్బారావు అన్నారు. తహశీల్దార్‌ కార్యాలయం వద్ద రెండు రోజుల నిరసన దీక్షలో భాగంగా ఇన్‌ఛార్జి తహశీల్దార్‌ ఎస్‌.వీరాస్వామి నాయుడుకు వినతిపత్రం అందజేశారు. దీక్షలకు సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ధనికొండ శ్రీనివాస్‌, కొట్టాడ



నరసాపురంలో..

వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో విఆర్‌ఎలు ఎం.నాగరాజు, ముత్యాలపల్లి గణేష్‌, సయ్యద్‌ హజర్‌ మోహిద్దీన్‌, కొడవర్తి శ్రీను పాల్గొన్నారు.

పాలకోడేరు : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు నాని మాట్లాడారు. ఈ ధర్నాలో వైస్‌ ప్రెసిడెంట్‌ రోబీయమ్మ, సెక్రటరీ కింతాడ రవి, సలహాదారుడు కడిమి రవి, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్‌ : విఆర్‌ఎలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు పెద్దిరాజు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రావూరి మాణిక్యాలరావు, సుబ్బారావు, అమలాపురం రాజు, పనసరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌ జి.అనితకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు కోటిపల్లి వేణు, చంటిబాబు, గణేష్‌, కృష్ణ, ప్రసాద్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : విఆర్‌ఎలకు పేస్కేల్‌ అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మండల సివిల్‌ సప్లై డిటి సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షులు రాపాక నరేష్‌, సెక్రటరీ టి.గోవింద్‌, ట్రెజరర్‌ టి.వెంకటేశ్వరరావు, మద్రే వరప్రసాద్‌, డి. నాగేశ్వరరావు, శివకుమార్‌ పాల్గొన్నారు.

తణుకురూరల్‌ : విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌ఎల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు ఎం.బలరాం, ఎం.ధర్మారావు, ఎ.సరస్వతి, ఎం.జ్యోతి, ఎన్‌.నాగబాబు, కె.పోసిబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌ కార్యాలయం వద్ద విఆర్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు బొంగ గణేష్‌ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు వెంకట్రావు, వెంకటేశ్వరరావు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్‌

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సర్వే చేసే క్రమంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌ వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌ నుంచి కలెక్టర్‌ ప్రశాంతి ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు చేయాల్సిన పనులపై అవగాహనా కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల బిఎల్‌ఒలతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడారు. జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఇఆర్‌ఒలు, తహశీల్దార్‌, ఎలక్షన్‌ డిటీలు, బిఎల్‌ఒలు, ఆయా నియోజకవర్గాల నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ ప్రశాంతి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి బిఎల్‌ఒలు చేపట్టనున్న ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వేలో ఎటువంటి తప్పుల్లేకుండా పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రత్యేక ఓటర్లను గుర్తించాలని, ట్రాన్స్‌ జెండర్‌, వికలాంగులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో హోమ్‌లెస్‌ పీపుల్‌ను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. జగనన్న కాలనీలకు వచ్చినవారు వివరాలు మ్యాపింగ్‌ల ద్వారా మానిటరింగ్‌ చేసుకోవాలన్నారు. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్‌ జాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటర్లు ఓటు వేసేందుకు అనువుగా పోలింగ్‌ బూతులు ఉండాలన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో సరిగ్గా పనిచేయనివారిపై, నిర్లక్ష్యం వహించే వారిపై, సమస్యలు తలెత్తే వారిపై ఎలక్షన్‌ కమిషన్‌ తీసుకునే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. బిఎల్‌ఒలు ఈ ఎన్నికల ప్రక్రియలో మొదటిసారిగా పనిచేస్తున్నారని, పాత బిఎల్‌ఒల కంటే మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.రామ్‌ సుందర్‌రెడ్డి, నరసాపురం సబ్‌ కలెక్టర్‌ ఎం.సూర్యతేజ మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్‌.అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం రూరల్‌

ప్రజా సమస్యలు విన్నవించుకునేందుకు కలెక్టరేట్‌ ప్రాంగణంలో ధర్నా చౌక్‌ ప్రాంగణం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్‌ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం గురువారం ప్రకటన విడుదలచేశారు. రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు, సంస్థల సమస్యలపై రాయబారాలు, ధర్నాలు నిర్వహించుకునేందుకు కలెక్టరేట్‌ సమీపంలో ఎటువంటి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావడానికి అవకాశమే లేకుండా పోతోందని తెలిపారు. గతంలో కలెక్టరేట్‌ ఆవరణలో చెట్ల కిందకు అనుమతించేవారని, ఇటీవల కాలంలో అసలు సమీపానికి కూడా అనుమతించడంలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై వచ్చిన ప్రజా సమూహాలు కలెక్టరేట్‌ను కూడా చూడలేకపోతున్నారని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమని తెలిపారు. ప్రజా సమూహాలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌, జిల్లా అధికార యంత్రాం గం దృష్టి ప్రజాస్వామ్యయుతంగా తీసుకొచ్చేందుకు కలెక్టరేట్‌ ఆవరణలో ధర్నా చౌక్‌ స్థలం కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ సానుకూలంగా స్పందించి వెంటనే స్థలం కేటాయించాలని తెలిపారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలతో చర్చించి సూచనలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.


ఆందోళనలో మాజీ ఎంఎల్ఎ రాజగోపాల్, సిఐటియు నాయకులు

నిత్యావసరాల ధరలను అదుపు చేయాలి

సిఐటియు ఆందోళన

ప్రజాశక్తి - పాలకొల్లు

రోజురోజుకు పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసరాల ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ విమర్శించారు. సిఐటియు మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రైస్‌మిలు వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజలు పౌష్టికాహారానికి దూరమవుతున్నారన్నారు. కనీసం నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. కందిపప్పు రూ.130లకు పైగా ఉందని, కూరగాయల ధర కిలో వంద రూపాయలపైనే ఉన్నాయని తెలిపారు. వాటిని ప్రభుత్వాలు అరికట్టకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో వ్యాపారులు ఇష్టానుసారం రేట్లు పెంచుతున్నారన్నారు. వెంటనే పెరుగుతున్న కూరగాయల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, రత్తయ్య, చల్లా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు గ్రామానికి చెందిన రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణరాజు కుమారుడు ఇందుకూరి రామం 35వ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. గత తొమ్మిదో తరగతిలో వల్లూరు ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు మట్టా సింధుకు రూ.558, గుబ్బల నాగ దుర్గారావుకు, రూ.558, వాడపల్లి దుర్గాభవానికి రూ.558, జల్లి అశోక్‌కు రూ.558 చొప్పున అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దార నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి నగదు బహుమతి అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమ ంలో నాయకులు కోసూరి సూర్యనారాయణరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న ప్రజాసంఘాల సంయుక్త సమావేశం

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 25వ తేదీన జిల్లాలోని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు కలిసి సంయుక్త సమావేశాన్ని భీమవరం ప్యాడి రైస్‌మిల్లర్స్ హాలులో నిర్వహించనున్నట్లు సమన్వయ కమిటీ కన్వీనర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కౌలు రైతు, రైతు కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి వారి సమస్యల పరిష్కారానికి ఆందోళనలు, నిరసనలు చేయడం కోసం ఒక ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా మరింత భారం వేసిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలు కోసం అన్ని పంటలకు మద్దతు ధరలు చట్టం కోసం, రైతు రుణ విమోచన చట్టం కోసం, విద్యుత్ సంస్కరణల ఉపసంహరణ కోసం ఢిల్లీలో ఐదు వందల రైతు సంఘాల ఆధ్వర్యంలో పదమూడు నెలలపాటు జరిగిన నిరసన కార్యక్రమంలో మోడీ ఇచ్చిన హామీలు అన్ని తుంగలో తొక్కారన్నారు. ఈ సమావేశానికి పార్టీలకు అతీతంగా తరలిరావాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పంచాయతీ పరిధి రావిగుంట, బాలవారిపాలెం రహదారి నిర్మాణానికి ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు రూ.15 లక్షలు మంజూరు చేయడం అభినందనీయమని సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు అన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానికులు ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఆ రహదారి నిర్మాణానికి జిఎస్‌పి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పి.సత్యనారాయణ, అడ్డాల పెద్దిరాజు, కేత చంద్రమ్మ, సుబ్బారావు, నెక్కంటి రామలింగేశ్వరరావు, కడలి ముత్యాలరావు, కోళ్ల రాజారావు, శీలం గురుమూర్తి, పి.రామారావు, దిగమర్తి కృష్ణమోహన్, అడ్డాల సూర్యప్రసాద్, మండే శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జివిఎల్.నరసింహరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశీపాడు హైస్కూలులో 99 మంది విద్యార్థులకు గురువారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించినట్లు స్కూలు ప్రధానోపాధ్యాయులు ఎఎస్ఎస్‌బిఆర్.ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లెప్పర్సి నోడల్ అధికారి నామాల రాజు మాట్లాడుతూ హిమోగ్లోబీన్ ఏడు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రతి గురువారం విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీని వాస్‌రెడ్డి, వి.శ్రీనివాస్, ఎఎన్ఎం శివకుమారి, ఆశాలు వరలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ బెంజిమెన్

ప్రజాశక్తి - తణుకు

ఖాతాదారులకు తమ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కె.బెంజిమెన్ చెప్పారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు వ్యవస్థాపకులు మహారాజ్ సాయాజీరావు గైక్వాడ్ విగ్రహానికి సిబ్బంది పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్పందన మానసిక వికలాంగుల పాఠశాలకు 20 కుర్చీలు, వంద కేజీల బియ్యం అందించారు. అనంతరం కస్టమర్లకు, డిపాజిట్‌దారులకు శుభాకాంక్షలు తెలియజేసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్లు నవీన్ చంద్ర, అనూజ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు భోజనం ప్లేట్లు సరిగా లేవని మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ దృష్టికి తీసుకెళ్లగానే ఆమె స్పందించారు. వారి సూచనల మేరకు బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, బిసి నాయకులు ఇల్లాపు అప్పాజీ ఆర్థిక సాయంతో మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో 68 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి కనకదుర్గ మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేసిన దాతల దాతృత్వానికి అభినందనలు తెలిపారు. అనంతరం బిసి నాయకులు ఇల్లాపు అప్పాజీ మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యాసామగ్రి అవసరమైతే తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదకు వాకర్స్ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - పాలకొల్లు

గణపవరం మండలం బావాయపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బత్తిన వెంకట్రావుకు కంటి చూపు మందగించి వైద్యం చేయించుకోవడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పాలకొల్లులోని బంధువుల ద్వారా విషయం తెలుసుకున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ స్పందించారు. క్లబ్ తరపున రూ.8 వేలతో పాలకొల్లు నేత్ర కంటి ఆసుపత్రి వారిచే శస్త్ర చికిత్స చేయించి అనంతరం మందులు, పండ్లు అందించారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు ఉన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్ బస్వ విజయకృష్ణ అన్నారు. భీమవరం పిఎస్ఎం బాలికొన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అరసవల్లి ఈశ్వరమ్మ వెంకటాచారి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 200 మందికి సుమారు రూ.25 వేల విలువైన స్టడీ మెటీరియల్స్, నోట్ పుస్తకాలను అందించారు. డాక్టర్ విజయకృష్ణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని, ప్రతి విద్యార్థి ఉన్నత చదువులను అభ్యసించాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు తమ ట్రస్ట్ తరపున పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం 200 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, నోట్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు యుగాసుధ, వారణాసి రాధాకృష్ణ పాల్గొన్నారు.


కాళ్లకూరులో కచ్చా డ్రెయిన్ తవ్వకం పనులు

దాతల సాయంతో కచ్చా డ్రెయిన్ తవ్వకం

ప్రజాశక్తి - కాళ్ల

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా కాళ్లకూరు సోమరాజు గరువు గ్రామం నుంచి దాతలు తమ వంతు సహకారంగా రహదారి అభివృద్ధికి నడుం బిగించారు. సోమరాజు గరువు రహదారిని అభివృద్ధి చేసేందుకు తొలుత కచ్చా డ్రెయిన్ తవ్వకం పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. సోమరాజుగరువుకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. వర్షాకాలంలో సోమరాజుగరువు రోడ్డు నుంచి ప్రజలు వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా వర్షపు నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కచ్చా డ్రెయిన్ తవ్వకంతో పాటు రోడ్డు అభివృద్ధి పనులు త్వరితంగా చేపడతామని ఆకివీడు ఎఎంసి మాజీ డైరెక్టర్ గోకరాజు మురళీకృష్ణంరాజు తెలిపారు. దాతలు వేగేశ్న రామ్మూర్తిరాజు, వేగేశ్న చిన్న సుబ్బరాజు, గొట్టుముక్కల కృష్ణంరాజు, ముచ్చర్లపాటి సత్యనారాయణ రాజు ఆర్థిక సహకారంతో కచ్చా డ్రెయిన్, రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మురళీకృష్ణంరాజు తెలిపారు.

మోటార్ సైకిల్ నష్టం చెల్లించండి

కంపెనీకి వినియోగదారుల కమిషన్ ఆదేశం

ప్రజాశక్తి - ఆకివీడు

మోటార్‌సైకిల్ యజమానురాలికి గ్యారెంటీ ఉన్న వాహనం విషయంలో సమాధానం చెప్పని కంపెనీకి వినియోగదారుల కమిషన్ షాక్ ఇచ్చింది. వినియోగదారుల సంఘాల రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య నివాసంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. స్థానిక పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ భార్య శ్యామల కాళ్ల మండలం ఏలూరుపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆ దంపతులు ఆకివీడులో నివాసం ఉండడంతో ఏలూరుపాడు స్కూల్‌కి వెళ్లేందుకు ఆమె మోటార్‌సైకిల్ కొనుక్కున్నారు. రూ.69 వేలకు ఏలూరులో కంపెనీ డీలర్ వద్ద కొనుగోలు చేశారు. వాహనం కొన్న కొన్నిరోజులకే మొరాయించింది. బ్యాటరీ పాడైపోయింది. రకరకాల ఇబ్బందులు పెట్టింది. కంపెనీ వద్దకు తీసుకెళ్తే కనీసం పట్టించుకోకపోవడంతో ఆమె వినియోగదారుల సంఘాల నాయకులు బొబ్బిలి బంగారయ్యను ఆశ్రయించారు. బంగారయ్య సలహా, సహకారాలతో ఆమె వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. కంపెనీకి నోటీస్ ఇచ్చి వినియోగదారుల కమిషన్ ప్రతివాదనలు, వాదనలు విన్న అనంతరం బాధితురాలు శ్యామలకు వాహనం ఖరీదు పూర్తి స్థాయిలో రూ.69 వేలు, ఫోరం ఖర్చులు రూ.ఐదు వేలు మొత్తం వడ్డీతో సహా చెల్లించాలని కమిషన్ తీర్పు చెప్పింది. నష్టం నాలుగు వారాల్లో నగదు రూపంలో చేరాలని కమిషన్ ఆదేశించినట్లు తెలిపారు.

పగిలిన పైపులైను తాగునీరు వృథా


వృథాగా పోతున్న తాగునీరు


ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని శివారు ప్రాంతాల్లో వర్షాకాలంలో సైతం తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. రైల్వే గేటు సమీపంలోని ఆంధ్రాబ్యాంకు వద్ద పైపులైన్ పగిలిపోయి నాలుగు రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పాలకొల్లు-భీమవరం ప్రధాన రోడ్డులో మున్సిపల్ పైపులైన్ పగలడంతో భారీ స్థాయిలో నీరు వృథాగా పోతుంది. ఇక్కడకు సమీపంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు స్వగృహాలు ఉన్నాయి. వృథాగా పోతున్న కుళాయి నీటితో రోడ్డు బురదమయమైన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని వెంప గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలో గత టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు, పైపు కనెక్షన్లు లేక అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. కొద్దిపాటి వర్షానికి రోడ్లు మునిగిపోయి నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి సంధి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వైఎస్ఆర్ కాలనీలో కూడా మౌలిక వసతులు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన హిల్లరీ జయంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి మొట్టమొదగ వెళ్లిన ఎడ్మండ్ హిల్లరీకి నార్గే గైడ్‌గా వ్యవరించారని, ఈ విజయం ప్రపంచ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోయిందని యూత్ హాస్టల్స్ కార్యదర్శి నందమూరి రాజేష్ అన్నారు. భీమవరం లయన్స్ క్లబ్ కార్యాలయంలో యూత్ హాస్టల్స్ అధ్వర్యంలో ప్రథమ హిమాలయ పర్వతాన్ని అధిరోహించిన సర్ ఎడ్మండ్ పర్సీవల్ హిల్లరీ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. యూత్ హాస్టల్స్ నాయకులు సిహెచ్.గాంధీ, డాక్టర్ బోణం పాండురంగారావు మాట్లాడుతూ 1939లో దక్షణ ఆల్ప్స్ పర్వతాల్లో ఉన్న ఆలివర్ పర్వత శిఖరాన్ని అధిరోహించడం హిల్లరీ జీవితంలో తొలి ప్రధాన సాహస కృత్యమన్నారు. ఎవరెస్ట్ అధిరోహణే కాకుండా హిమాలయ పర్వతాల్లోని మరో పది శిఖరాలను కూడా హిల్లరీ అధిరోహించాడన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 8848 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగల హిమాలయ పర్వతాల్లోని ఎవరెస్టు శిఖరం అధిరోహణ అత్యంత సాహసమైన కృత్యమన్నారు. అనంతరం విద్యార్థులకు హిల్లరీ జీవిత చరిత్రపై పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అడపా సత్యవతి, పేరిచర్ల లక్ష్మణవర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్న మాదాసి గోపి

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి అన్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో ఉండి కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మాదాసి వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీలో చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాదాసి గోపి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదుగుతారని ఆయన సూచించారు. విద్య వెలకట్టలేనిదని, ఎవరూ దొంగలించలేనిదని, అటువంటి విద్యను నిర్లక్ష్యం చేయకూడదని పాఠశాల ఉపాధ్యాయుడు దాగారపు గోపాలం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, ఆర్ఎంపి డాక్టర్ ఎం.ప్రశాంత్, ఎం.రామయ్య, ఆశా కార్యకర్త పార్వతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధస్సుకు పదును

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పురాణ కాలంలో చదరంగానికి మంచి ప్రాచుర్యం ఉండేదని, రాజుల సంస్థానంలో ఈ క్రీడను ఎక్కువగా పోషించేవారని, 64 గదుల్లో తమ మేధస్సుకు పదును పెట్టి గెలుపొందడం చదరంగం ముఖ్య అంశమని జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షులు తోట బోగయ్య అన్నారు. గురువారం భీమవరం సిఎస్ఎన్ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ చిడే సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో విద్యార్థులు సెల్‌ఫోన్స్‌కు అత్తుకుపోతున్నారన్నారు. చదరంగం మనిషిలోని సృజనాత్మకతను వెలికితీస్తుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలో జిల్లా చదరంగం అసోసియేషన్ స్థాపించి ఐదేళ్లుగా 200కి పైగా టోర్నమెంట్లు నిర్వహించారన్నారు. ఈ నెల 23న టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి మెడల్స్, బహుమతులను అందించారు. గమిని పవన్‌కుమార్‌లను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీంఖాన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, కళాశాల పిఇడిలు పాల్గొన్నారు.

పాలకొల్లు : చదరంగంలో మెలకువలు నేర్చుకుంటే జీవితంలో విజయం సాధించినట్లేనని యునైటెడ్ కాపు క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ చెప్పారు. అంతర్జాతీయ చదరంగ దినోత్సవం సందర్భంగా గురువారం పాలకొల్లు దీప్తి స్కూల్లో చదరంగం పోటీలు నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ రావూరి అప్పారావు మాట్లాడుతూ చదరంగం ఆడటం వల్ల మెదడుకు ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం చెస్ కోచ్ సురేష్‌ని సత్కరించారు. చెస్ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం నూకల లలితారాణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రజల సమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని లంకలకోడేరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యేక క్యాంపులో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, కౌంటర్‌లు, అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులను ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, తహశీల్దారు సిహెచ్.పెద్దిరాజు, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులనాయుడు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, చిలుకూరి కుమార దత్తాత్రేయవర్మ పాల్గొన్నారు. మండలంలోని తిళ్లపూడి గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచి నడపన శ్రీనివాసరావు అధ్యక్షతన, సగం చెరువు గ్రామంలో సర్పంచి కడలి నాగమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ హాజరై అర్హులకు ధ్రువపత్రాలను అందించారు.

ఆచంట : మండలంలోని అయోధ్యలంక గ్రామంలో సర్పంచి కడలి కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొని అర్హులకు ధ్రువపత్రాలు అందించారు. అనంతరం గోదావరి ఇసుక ర్యాంపు నుంచి నీటిలో కొంతమేర నడుచుకుంటూ వరద పరిస్థితిని సమీక్షించారు.

పోడూరు : మండలంలోని పెనుమదం శివాలయం వద్ద గ్రామ సర్పంచి తానేటి బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. స్థానికులకు అవసరమైన ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ తాతాజీ, ఎంపిపి సబ్బితి సుమంగళి, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంపిడిఓ సుహాసిని, సొసైటీ ఛైర్మన్ వీరాస్వామి పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని వెలగలవారి పాలెంలో, పెనుమంట్రలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక, వెలగల సుగుణ, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణయ(మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), పెనుమంట్ర ఉప సర్పంచి భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు, రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణు మాధవ రెడ్డి, మండల కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కాళ్ల మండలంలో..

యలమంచిలి : మండలంలోని ఇలపకుర్రు గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురికి వివిధ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార దత్తత్రేయ వర్మ, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జిల్లా యూత్ అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్, ఎంపిపి రావూరి వెంకట రమణ బుజ్జి పాల్గొన్నారు.

కాళ్ల: సిఎం జగన్ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని ప్రాతళ్లమెరక, ఎల్ఎన్.పురం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహంచారు. ఈ సందర్భంగా 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి కిషోర్‌కుమార్, వైసిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న బాలగణపతి వర్మ పాల్గొన్నారు.

వీరవాసరం : మండలంలోని అండలూరు, బలుసులగొయ్యిపాలెంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ మానుపాటి ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు బొల్లెంపల్లి శ్రీనివాస్‌చౌదరి, సర్పంచులు ఇళ్ల పూర్ణబాలభారతి, పాతగొలుసు భోగేశ్వరావు, వీరవల్లి శ్రీనివాసరావు, బోణం పరమేశ్వరావు, తహశీల్దార్ ఎం.సుందరాజు, ఎంపిడిఓ జ్యోతి, ప్రత్యేకాధికారి సుజాతరాణి, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : మండలంలోని శ్రీరాంపురం, వెంప గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు, ప్రజలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సభల్లో ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, శ్రీరామపురం గ్రామ సర్పంచి కలిదిండి సుజాత, గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్ కలిదిండి ఫణిరాజు, ఎంపిటిసి సభ్యులు పెనుమత్స సాయిలక్ష్మి, అల్లూరి కృష్ణంరాజు, వెంప సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కలిదిండి మురళికృష్ణంరాజు, కలిదిండి చంద్రరాజు, దాట్ల శ్రీనివాసరాజు, బలరామరాజు, భాగ్యనందం పాల్గొన్నారు.

ఉండి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని ఎంపిడిఓ అడబాల వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని కలిసిపూడిలో సర్పంచి కేశబోయిన జానకి శ్రీనివాస్, అర్ధమూరు గ్రామంలో గోనబోయిన వీర్రాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. కలిసిపూడి గ్రామంలో 1137 మంది, అర్ధమూరు గ్రామంలో 1211 మంది ధ్రువీకరణ పత్రాలను పొందినట్లు అధికారులు తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని కాళీపట్నం పడమర, రామన్నపాలెం-2 సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం ధ్రువపత్రాలను అందించారు.

పెనుగొండ : మండలంలోని ములపర్రు, ఇలపర్రు, గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడారు. అర్హులకు వివిధ ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు పోడూరి గోవర్ధన, మండల సర్పంచుల ఛాంబర్స్ అధ్యక్షురాలు దండు పద్మావతి, ములపర్రు సర్పంచి మర్రే రాజేశ్వరి పాల్గొన్నారు.